# ప్రజలకు ఉచితంగా దరఖాస్తులు అందిస్తాం

● పేదలకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సేవలందించాలి ● అర్హులందరి దరఖాస్తులు స్వీకరించాలి: ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్,డిసెంబర్30: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పథకాలకు దరఖాస్తు చేసేందుకు అర్హులైన వారికి అవకాశం కల్పించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావు గౌడ్ అధికారులకు సూచించారు. శనివారం పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచితంగా ప్రజలకు దరఖాస్తులను సమకుర్చుతామని, దరఖాస్తు పత్రాలను దాఖలు చేసేందుకు ఇబ్బంది పడకుండా తమ కార్యాలయం ద్వారా సేవలు అందించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పేదలకు ఉపకరించే దరఖాస్తు పత్రాలను కూడా కొందరు డబ్బులకు విక్రయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడకుండా అధికారులు సహకరించాలని జీ హెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులను ఆయన ఆదేశించారు.



సీతాఫల్‌మండిలో ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై నాయకులతో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'ప్రజాపాలన'లో భాగంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్యారసాని రామ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌తో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రజాపాలన కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అష్రాఫ్, బిట్టు, శ్రీను, రాకేశ్ పాల్గొన్నారు. – బొల్లారం, డిసెంబర్ 30



ఓయూలో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

## ఓయూలో ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. యూనివర్సిటీలను మూసివేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్, నాయకులు ఆంజనేయులు, సాయికిరణ్, కృష్ణ, శ్రీధర్, శ్రీకాంత్, ప్రశాంత్, శిరీష, నిహారిక, హుస్సేన్, వెంకటేశ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు శనివారం కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, పొలిటికల్ సైన్స్ విభాగాల ప్రీపీహెచ్‌డీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలతో పాటు బీఈడీ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశామని, ఈ ఫలితాలను www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, డిసెంబర్ 30: రైలు పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు కథనం ప్రకారం.. సీతాఫల్‌మండి బి క్యాబిన్–లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్యన గుర్తు తెలియని ఓ వ్యక్తి (40–45) ఏండ్ల వ్యక్తి రైలు పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తపంచతో చిక్కిన అల్లుడు..!

సిటీబ్యూరో, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ): భార్య, అత్తమామలపై దాడికి కుట్ర పన్నిన ఓ వ్యక్తిని సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ అస్లాం రెండేండ్ల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చాడు. అతడు మొదటి భార్యకు విడాకులు ఇచ్చి, షమీనాను రెండో పెండ్లి చేసుకున్నాడు. కొంతకాలంగా వీరి మధ్య విభేదాలు తలెత్తగా.. అత్తమామలు కూడా జోక్యం చేసుకోవడంతో వాళ్ల మధ్య గొడవలు తారాస్థాయికి చేరాయి. ఈ క్రమంలో అతడు యూపీకి చెందిన నసీమ్ అనే వ్యక్తి నుంచి తపంచ, రెండు కాట్రిడ్జ్‌లు కొనుగోలు చేశాడు. అస్లాం అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకుని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సౌత్‌జోన్ పోలీసులు అస్లాంను చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.



ఓయూలో అంతర్జాతీయ సింపోజియం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

## నూతన ఆవిష్కరణ దిశగా పరిశోధనలు జరగాలి

● నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్30: నూతన ఆవిష్కరణలు చేసే దిశగా పరిశోధనలు జరగాలని నగరంలోని 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ అన్నారు. ఆ దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 'రీసెంట్ చాలెంజెస్ ఇన్ ఇంజినీరింగ్'పై రెండవ అంతర్జాతీయ సింపోజియంను నిర్వహిస్తున్నారు. 'పర్‌స్పెక్టివ్ అండ్ చాలెంజెస్ ఇన్ ఇంజినీరింగ్ ఆన్ ది మూన్'అనే అంశంపై కళాశాల అసెంబ్లీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఈ సింపోజియం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రకాశ్ చౌహాన్, గౌరవ అతిథిగా సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు వెల్లంకి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రయాన్ సందర్భంగా ఇంజినీరింగ్ విభాగాల్లో వస్తున్న మార్పులను వివరించారు. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య జ్ఞాన మార్పిడి సహకారానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సదస్సు చైర్‌పర్సన్‌లు డాక్టర్ డి.విజయ్‌కుమార్, ప్రొఫెసర్ కృష్ణయ్య, కన్వీనర్‌లు డాక్టర్ వెంకటరామయ్య, ప్రొఫెసర్ శశికాంత్, డాక్టర్ కుమారి, రాంరెడ్డి, ప్రొఫెసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని తొలగించాలి: బీపీఎస్‌పీ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను తక్షణమే తొలగించాలని భీమ్ పూలే స్టూడెంట్స్ పరివార్ (బీపీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు హరిలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో హరిలాల్‌నాయక్ మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. కానీ వారిని తిరిగి ఆ పదవుల్లో కొనసాగాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మౌఖికంగా ఆదేశించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీపీఎస్‌పీ కార్యదర్శి ప్రవీణ్, నాయకులు శేఖర్, శ్రీధర్, శరత్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దేవర వంశీ(22), ఒడిశాకు చెందిన మానస్ రంజన్ లబాలా(26), ఒడిశాలోని సర్గిగూడకు చెందిన చందన్ కుమార్ రథ్(25) కొంత కాలంగా గంజాయి అక్రమంగా తరలిస్తుండగా శనివారం వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరిని పట్టుకున్నారు. వీరి నుంచి 7.5 కిలోల గంజాయి, ఒక లక్ష రూపాయల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై డ్రగ్స్ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్లుగా టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ శ్రీబాలా వెల్లడించారు. డ్రగ్స్ ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

## 1న రాష్ట్రపతి నిలయం ఓపెన్

బొల్లారం, డిసెంబర్ 30: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనార్థం జనవరి 1న తెరిచి ఉంటుందని రాష్ట్రపతి నిలయంలో బుకింగ్ కౌంటర్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చని పరిపాలన అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచే రాష్ట్రపతి నిలయం తెరిచామని, శీతాకాల విడిదిలో ప్రజల కోసం 3 పురాతన మెట్ల బావులు, ఎద్దుల ద్వారా నీరు తోడే పద్ధతి మ్యూజియంను ఏర్పాటు చేశామని తెలిపారు.జనవరి 13,14 తేదీల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ఆరేండ్లు సహజీవనం చేసి..

బంజారాహిల్స్, డిసెంబర్ 30: ఆరేండ్ల పాటు సహజీవనం చేసి మహిళను మోసం చేసిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలుకు చెందిన మేడబోయిన లక్ష్మి(33) భర్తతో విడిపోయి నగరానికి వచ్చింది. ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీ నగర్ బస్తీలో నివాసం ఉంటున్న లక్ష్మి హౌస్‌కీపింగ్ పనిచేస్తుంది. ఆరేండ్ల క్రితం వైజాగ్‌కు చెందిన బత్తుల సతీశ్ (40)తో స్నేహం ఏర్పడడంతో అతడితో కలిసి సహజీవనం చేస్తోంది. పెళ్లిచేసుకుంటానని నమ్మించిన సతీశ్ ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాడు. కాగా రెండేళ్ల క్రితమే సతీశ్ మరో మహిళను పెళ్లి చేసుకున్నాడని ఇటీవల తెలుసుకున్న లక్ష్మి తాను మోసపోయినట్లు గుర్తించింది. సతీశ్‌పై చర్యలు తీసుకోవాలంటూ శనివారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నన్ను చూసి నవ్వారంటూ..

బంజారాహిల్స్, డిసెంబర్ 30: తనను చూసి ఎందుకు నవ్వారంటూ యువకుడిపై దాడికి పాల్పడిన వ్యక్తితోపాటు అతడికి సహకరించిన మరికొంత మందిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకి సమీపంలోని మిరాజ్ కాలనీకి చెందిన అబ్దుల్ రాఫేఖాన్(19) శాంతినికేతన్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడు ఇబ్రహీం అలీతో కలిసి టోలీచౌకీలోని ఫోరమ్ మాల్‌కు వెళ్లారు. అక్కడ నలుగురు యువతులు ఓ యువకుడిని గుంజీలు తీయిస్తున్న విషయాన్ని గమనించిన రాఫేఖాన్ అతడి స్నేహితులు నవ్వుతూ కిందకు వచ్చేశారు. కాసేపటికి మాల్ ఎదురుగా జ్యూస్ సెంటర్‌వద్ద నిలబడగా గుంజీలు తీసిన యువకుడు అక్కడకు చేరుకుని తనను చూసి ఎందుకు నవ్వుతూ కామెంట్ చేశారంటూ గొడవకు దిగి వారిని చితకబాదారు. దీంతో తీవ్రగాయాలపాలైన ఇబ్రహీంను జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు బాధితుల మీద దాడికి పాల్పడిన సొహైల్, ఉమేర్, సాహిల్ తదితరులపై ఐపీసీ 324, 323 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రద్దీ ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: వీధి వ్యాపారులు రద్దీ ప్రాంతాల్లో వాణిజ్యం చేయకూడదని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. తార్నాకలో ప్రధాన రహదారిపై వీధి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి ఆయన శనివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాల్లో వీధి వ్యాపారాలు నిర్వహిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, ట్రాఫిక్ తక్కువగా ఉండే ప్రాంతాల్లో వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై జయానంద్, సిబ్బంది పాల్గొన్నారు.